క్లుప్తంగా

ఘనంగా తీజ్



మహాముత్తారం: ప్రతీ సంవత్సరం దీపావళి ముందు వచ్చే గురువారం ఆనవాయితీగా నిర్వహించే తీజ్ ఉత్సవాలను లంబాడీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బోర్లగూడెం తండా, పెగడపల్లి, ప్రేమ్‌నగర్, రెడ్డిపల్లి గ్రామాల్లోని తండాల్లో వారి ఆరాధ్య దైవమైన కులదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తొమ్మిది రోజులు నానబెట్టిన గోధుమనారును పంచుతూ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం మహిళలు, పురుషులు దండియా ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని లంబాడీ అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలో కృష్ణాపురం, పెద్ద గొళ్లగూడెం గ్రామాల వద్ద జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై రమేష్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసుల గురువారం సాయంత్రం వాహన తనిఖీలను నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చెయ్యడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు.

ఆర్థికసాయం



టేకుమట్ల: మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన లడే తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శివసాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు రూ.5016ల చెక్కును ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు, ఇన్‌చార్జ్‌లు నాగుల కమల, కల్యాణి, పద్మ, సరిత, లక్ష్మీనారాయణ, కావ్య, కవిత, దావ్య, తదితరులు ఉన్నారు.

నియామకం



ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రేగ కల్యాణిని నియమించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సీతక్క ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్, గుడ్ల దేవేందర్, చిటమట రఘు, సులేమాన్, నర్సింగరావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేగొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడ(శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు మండల ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు.

క్రేన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కాటారం: ఓ క్రేన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన మండలంలోని కాటారంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాటారం వద్ద క్రేన్‌తో రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి నుంచి కాటారం వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు క్రేన్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కరికి తీవ్ర గాయాలయ్యాయి.

ఏటీఏ ఆవిర్భావ వేడుకలు

వాజేడు: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహంవద్ద ఏటీఏ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఇరుప బాలాజీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. 317లో స్థానికత సమస్యతో సతమతమవున్నట్లు తెలిపారు. ఏజెన్సీ, మైదాన ప్రాంతం అనే వ్యత్యాసం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధబోయిన జోగయ్య, పెండ కట్ల బుచ్చిబాబు, మడివి నాగేందర్, నాగేంద్ర ప్రసాద్, రాజ్య లక్ష్మి, శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఏటీఏ ఆవిర్భావ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అటవీశాఖ అతిథిగృహం సమీపంలో ఏటీఏ జెండాను రాష్ట్ర కార్యదర్శి బోదేబోయిన పరమేశ్‌రావు ఆవిష్కరించారు. అనంతరం కొమురం భీం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రెజరీల్లో పేరుకు పోయిన బిల్లులను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల సూర్యనారాయణ, తోలెం చిరంజీవి,చింత శేష నర్సింమారావు, జెజ్జరి సుధాకర్ , సిద్ది భోయిన భుజంగరావు, , కారం నాగరాజు, సోయం సురేష్, తెల్లం కామేశ్వరావు, యాలం సురేష్ తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె): ఏటీఏ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



వాజేడులో..

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రైతులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని గురువారం రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో ప్రైవేట్ మాక్స్ ధాన్యం కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయడంతో తేమ పేరుతో ఒక్క బస్తాకు 4 నుంచి 5 కిలోలు కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన మాదిరిగానే పీఏసీఎస్, డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రాజసమ్మయ్య, బుచ్చయ్య, చంద్రయ్య, రవి, రాజు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పలు పార్టీల నాయకులు గురువారం జోరుగా నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని రామప్ప కాలనీ, 1000 క్వార్టర్స్‌లలో, టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి, పెద్దంపల్లి, వెలిశాలలో, చిట్యాల మండలంలోని జడల్‌పేట, గాంధీనగర్, భావుసింగ్‌పల్లి, గోపాలపూర్ గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తి రెడ్డి ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా రేగొండ మండంలోని భాగిర్థిపేట, దుంపిల్లపల్లి, గూడేపల్లి, కొడవటంచ, పొనగల్లు, మడతపల్లి, జోగయ్యపల్లి, లింగాల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ప్రజాదీవెన యాత్ర నిర్వహించారు. అలాగే భూపాలపల్లి పట్టణంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కంటూరి రాంనరసింహారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లి గ్రామస్తులు కోటంచ ఆలయంలో పూజలు చేశారు.

ఏటూరునాగారంలో..

ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ గురువారం జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. తుమ్మ మల్లారెడ్డి, రఘు, ఖాజాపాషా పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



కాటారం: బెల్లం పానకం పారబోస్తున్న ఎస్సై



నర్సంపేట రూరల్: గుడుంబా, ద్విచక్ర వాహనాలను చూపిస్తున్న పోలీసులు

కాటారం: కాటారం అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ ప్రశాంతి ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. పలు చోట్ల గుడుంబా తయారు చేసి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రశాంతి, ఎస్సై గంగాధర్ తెలిపారు. ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లం పానకం పారబోసి తయారీ సామగ్రి ధ్వంసం చేసినట్లు వారు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రాంచందర్, కవిత పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

నర్సంపేట రూరల్: అక్రమంగా తరలిస్తున్న గుడుంబా, రెండు ద్విచక్ర వాహనాలను పట్టుకొని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణ శివారులో రూట్ వాచ్ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై 15 లీటర్ల గుడుంబా, 50కిలోల బెల్లం, రెండు కిలోల పటిక, డ్రై ఈస్ట్ పౌడర్ లభ్యమైందని వెంటనే వాటిని సీజ్ చేసి కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన భూక్యా తిరుపతి, నెక్కొండ మండలంలోని గ్యాంగ్ తండాకు చెందిన బానోత్ సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన బెల్లం, పటిక, గుడుంబాను అక్రమంగా ఎవరు రవాణా చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నందున అనధికారికంగా మద్యం నిల్వలు, సరఫరా చేసిన సమాచారం అందించాలని కోరారు. టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523, 0870 2930190, 8712659016లకు సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

14న ప్రాంగణ నియామకాలు

నర్సంపేట : నర్సంపేటలోని భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఈనెల 14వ తేదీన ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గాదె రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియామకాలకు నర్సంపేట డివిజన్ పరిధిలోని అన్ని ఒకేషనల్ కళాశాలల విద్యార్థులు (ఎంఎల్‌టీ పూర్తయిన వారు), జూనియర్ కళాశాలల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ పూర్తయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 2022–23లో పూర్తి అయిన విద్యార్థులు, 20 సంవత్సరాల్లోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నియామకా టలకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 98667 76874, నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా మాచెర్ల సత్యం



సత్యంకు బాధ్యతలు అప్పగిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కాటారం: కాంగ్రెస్ పార్టీ కాటారం టౌన్ ప్రధాన కార్యదర్శిగా మాచెర్ల సత్యం నియమితులయ్యారు. మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి సహకరించిన శ్రీధర్‌బాబుతో పాటు యూత్ నాయకుడు శ్రీనుబాబు, మండల కాంగ్రెస్ నాయకులకు సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని జాకారం, అబ్బాపూర్ గ్రామాల్లో సీఆర్పీఎఫ్, పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎస్ 38 ఈ, 58 సీ బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో గండ్ర జ్యోతి

రేగొండ: వైఎస్సార్‌టీపీ రేగొండ మండల అధ్యక్షుడు పల్లెబోయిన తిరుపతి అతడి అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో గురువారం చేరారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ములుగు రూరల్: నియోజకవర్గంలోని కొత్తగూడ మండలం గోపాలపూర్ గ్రామ ఉప సర్పంచ్ రత్న సారంగపాణి గురువారం జిల్లా కేంద్రంలో లీలా గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేశారు. ఆ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ యాదవ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య దేవ్‌సింగ్, అజ్మీర ధరమ్‌సింగ్, పూనం సోయమ్మ, సంపత్, భూక్య సాంబలక్ష్మీ, పాపయ్య, వినీత్, నగేష్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని బీజేపీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు కావిరి సంతోష్, చిన్నికృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు సునార్కని సుధాకర్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుపరిపాలన

- ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క



ఇస్త్రీ చేస్తూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ఏటూరునాగారం: ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రజలకు మంచిపాలన అందిస్తామని ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలో ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో సీతక్క ప్రజలతో సమావేశమయ్యారు. ఆ వీధికి చెందిన ఎరబ్రెల్లి మనోజ్ కుమార్ పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరడంతో సీతక్క కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం 200 మంది ప్రజలు పార్టీలో చేరగా సీతక్కవారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పది సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఉన్నానన్నారు. ప్రతి పల్లెకు గుడిసె గుడిసెకు తిరిగి తన వంతు సహకారాన్ని వారికి అందించానన్నారు. వరదల సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా వరద ప్రాంతాల్లోకి దూసుకెళ్లి బాధితులను ఆదుకున్నట్లు తెలిపారు. ఇతర దేశాల నుంచి కూడా నిధులు తెప్పించి తన ప్రజల కోసం ఆ నిధులను ఖర్చు చేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు గానీ ఇతర పార్టీల ప్రలోభాలకు గురికాకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాగా మండలంలో ప్రచారంలో భాగంగా ఓ లాండ్రీ షాపు వద్ద బట్టలను ఇస్త్రీ చేసి ఇక ఇస్త్రీ చేసుడే అంటూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పైడాకుల అశోక్, ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, గుడ్ల దేవేందర్, సులేమాన్, నర్సింగరావు, ఖలీల్, ఆయూబ్, పర్వతాల లాలయ్య, రాధిక, కొప్పుల సరిత, రియాజ్, గౌస్, వావిలాల ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పట్టుదల పెరగాలి

ఏటూరునాగారం: ఎన్ఐటీ, ఐఐటీలో సీట్లు పొందాలంటే విద్యార్థుల్లో పట్టుదల పెరగాలని ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరునాగారంలో లైఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జామ్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు గాను ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం చిన్న మాట్లాడుతూ.. శిక్షణ పొందిన అనంతరం కళాశాల విద్యార్థులు దేశంలో ఉన్న ఉన్నతమైన జాతీయ విద్యా సంస్థలలో ఐఐటీ, ఎన్ఐటీ కేంద్రీయ విశ్వ విద్యాలయాలలో ఉన్నత చదువుల కోసం పట్టుదలతో శ్రమించి సీటు సాధించాలని సూచించారు. కళాశాల విద్యార్థులే కాకుండా డిగ్రీ పూర్తయిన ఇతర విద్యార్థులు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందొచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీందర్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉన్నత విద్యాసంస్థలలో సీట్ సాధించాలని సూచించారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, జువాలజీ డాక్టర్ యు స్వామి ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై షేక్ మస్తాన్

గోవిందరావుపేట: అపరిచిత వ్యక్తులుకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. పస్రా పరిధిలోని ప్రాజెక్ట్ నగర్ గొత్తికోయ గుంపును ఎస్సై సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గొత్తికోయలతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో అపరిచిత వ్యక్తులకు, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పించకూడదని, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు తెలియజేయాలని తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు



క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లీగల్ సర్వీస్‌డే పురస్కారించుకుని క్విజ్, వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అనే అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి బహుమతులు అందజేశామని తెలిపారు. అలాగే ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థుల పత్రాలను జిల్లా స్థాయికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రణీత, స్వాతి, లావణ్య, రాజశేఖర్, రమేష్, లింగయ్య, సతీష్, శ్రీధర్, ఓదేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక



ప్రశంస పత్రం అందుకుంటున్న మృదులత

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని మృదులత తెలంగాణ కళాఉత్సవాల పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుభాషిణీదేవి తెలిపారు. హనుమకొండలో గురువారం జిల్లా స్థాయి కళాఉత్సవాల పోటీలు నిర్వహించగా మృదులత అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రశంస పత్రం అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికై మృదులతను పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిని దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

దయ్యాలవాగులో మునిగి యువకుడి మృతి

గోవిందరావుపేట: ప్రాజెక్ట్ నగర్ గ్రామానికి చెందిన వజ్జ సాంబరావు అలియాస్ దివాకర్ (38) దయ్యాల వాగులో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. వివరాలలోకి వెళ్లితే.. మండలంలోని పస్రా గ్రామంలో దివాకర్ కార్పెంటర్ పని చేసుకుంటూ మద్యానికి బానిసై ప్రతిరోజు తాగుతూ ఉండేవాడు. ఈ క్రమంలోనే గురువారం మద్యం సేవించి, పస్రా గ్రామంలోని దయ్యాల వాగు బ్రిడ్జి వద్ద వాగులో ఈత కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వజ్జ సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ప్రారంభించినట్లు ఎతలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కొటం రవిపటేల్



ముమ్మరంగా నామినేషన్లు..

భూపాలపల్లి అర్బన్/ములుగు: భూపాలపల్లి, ములుగు అసెంబ్లీ స్థానాలకు గురువారం వివిధ పార్టీల నాయకులు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ వేస్తున్న మంతెన సంపత్



ములుగులో నామినేషన్ వేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి నూనావత్ చంద్రూనాయక్

'బీసీలను ఓట్లు అడిగే హక్కు లేదు'

పరకాల: బీసీలను ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల రూరల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ మళ్లీ ఓట్లు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. పరకాల అభివృద్ధిలో వెనుకబాటుకు స్థానిక ఎమ్మెల్యేనే కారణమని ఆరోపించారు. పరకాలను అమరవీరుల జిల్లా చేయాలంటూ ప్రజలు ఉద్యమిస్తుంటే మరోవైపు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శ్రీలంక బీచ్‌లో కాలక్షేపం చేసిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్, జిల్లా కార్యదర్శులు రామన్న, శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రావు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కొమ్మిడి మహేందర్‌రెడ్డి, మెడికల్ సెల్ కన్వీనర్ కసగాని రాజ్‌కుమార్ పాల్గొన్నారు.